www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం

గురువారం 01 మే 2025

## విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003

- ఫార్మ్ హౌస్ లో పడుకుని ఏం సందేశం ఇస్తున్నారు?
- పదేండ్లు మేం ఫామ్ లో నువ్వు ఫాంహౌజ్ లోనే..
- ప్రజా సొమ్ము తింటూ వారి సమస్యలను విస్మరిస్తారా?
- బహిరంగ సభలో నా పేరు ఎత్తడానికీ మీకు ధైర్యం రాలేదు

కలంజ్యోతి, హైదరాబాద్ : ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి రాని కేసీఆర్ కు అసలు ప్రతిపక్ష హోదా ఎందుకు అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. గత 15 నెలల నుంచి ఫాం హౌజ్ లోనే పడుకున్న మాజీ సీఎం సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏనాడైనా అసెంబ్లీకి వచ్చి సభలో ప్రజల సమస్యలు ఏదైనా ప్రస్తావించారా..? మా ప్రభుత్వ లోపాలు చెప్పావా..? మంచిని అభినందించావా..? అని నిలదీశారు. ప్రభుత్వం నుంచి జీతాలు, ఇతర అన్ని వసతులు అనుభవిస్తూ..ప్రతిపక్ష పాత్ర పోషించకపోతే ఎలా అని మండిపడ్డారు. ఎక్కడైనా ఎవరైనా ప్రభుత్వం నుండి జీతం తీసుకుంటూ ఇంట్లో నుండి కాలు కదపకుండా అన్ని వసతులు అనుభవిస్తున్నారా అని ప్రశ్నించారు. సభకు రాకుండా, ప్రతిపక్ష హోదా నిర్వర్తించకుండా ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వాన్ని విమర్శించాలని ఏ చట్టంలో ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో పదవ తరగతి పరీక్ష

మిగతా 4లో



# ప్రతిపక్ష హోదా ఎందుకు?

కేసీఆర్‌ను నిలదీసిన

## సీఎం రేవంత్

- కేంద్ర మంత్రివర్గ భేటీలో కీలక నిర్ణయం
- వివరాలు వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్
- షిల్లాంగ్ నుంచి సిల్చార్ హైవే రూ. 22,684 కోట్లతో స్పీడ్ కారిడార్
- చెరకు ఎఫ్ ఆర్ పీ ధర రూ. 355కు పెంపు
- కులగణన డేటా వెల్లడించిన తొలి రాష్ట్రం బిహార్
- గణన సెప్టెంబర్ లో ప్రారంభం
- తుది డేటా 2026 లేదా 2027లో వెల్లడయ్యే అవకాశం

3లో



# కులగణనకు ఓకే

# 92.78 శాతం ఉత్తీర్ణత

- పది ఫలితాల్లో మెరిసిన బాలికలు
- 91.32 శాతం బాలురు, 94.26 శాతం బాలికలు
- అగ్రస్థానంలో మహబూబాబాద్
- చివరి స్థానంలో వికారాబాద్
- జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు
- ఫలితాలు ప్రభుత్వ తీరుకు గీటురాయి: సీఎం





## సీఎస్‌గా రామకృష్ణారావు బాధ్యతల స్వీకరణ

**ఉద్యోగ విరమణ చేసిన శాంతికుమారి**

**కలంజ్యోతి, హైదరాబాద్:** తెలంగాణ నూతన సీఎస్ గా కె. రామకృష్ణారావు బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం వరకు విధులు సీఎస్ గా విధులు నిర్వర్తించిన శాంతికుమారి బుధవారం పదవీ విరమణ చేశారు. దాంతో సీఎస్ గా రామకృష్ణారావు బాధ్యతలు చేపట్టారు. 1991 బ్యాచ్ కు చెందిన రామకృష్ణారావు గతంలో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా పని చేశారు. సుధీర్ఘకాలం ఆర్థిక శాఖలో పనిచేసిన అనుభవం దృష్ట్యా ఆయనను సీఎం రేవంత్ రెడ్డి.. సీఎస్ గా నియమించారు. కాగా రామకృష్ణారావు వచ్చే ఏడాది ఆగష్టులో పదవీ విరమణ చేయనున్నారు. ఇది వరకు సీఎస్ గా బాధ్యతలు నిర్వహించిన శాంతి కుమారికి ప్రభుత్వం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల విభాగం వైస్ ఛైర్మన్ గాను, ఎంసీఆర్హెచ్ఆర్డీ జనరల్ డైరెక్టర్ గా బాధ్యతలు అప్పజెప్పింది.




## పది ఫలితాల్లో ఐఎంఎస్ సత్తా

**కలంజ్యోతి, నల్గొండ :** పదో తరగతి ఫలితాల్లో నల్గొండ జిల్లా కేంద్రంలోని చైతన్యపురి కాలనీలో ఉన్న ఐఎంఎస్ సంస్కృతి ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయఢంకా మోగించారు. పట్టణంలో ఇతర కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటారు. పాఠశాలకు చెందిన బి.జశ్వంత్ 535 మార్కులు సాధించి స్కూల్ టాపర్ గా నిలిచారు. జి.బాల చైతన్య 534, ఆర్. కార్తీక్ 534, బి.శశాంక్ 530, పి.రవిత్రేణి 524, బి.హర్షవర్ధన్ 520, ఐ.ప్రవర్ధిని 517, ఎన్.వర్ష 515, కె.నందిని 509 మార్కులు సాధించారు. సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించిన ఐఎంఎస్ పాఠశాల యాజమాన్యాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు ఏ. జానకీ రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, రమణరెడ్డి, జానకీ రెడ్డి, పాఠశాల అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

# 92.78 శాతం ఉత్తీర్ణత

**కలంజ్యోతి, హైదరాబాద్ :**

పదో తరగతి ఫలితాల్లో 92.78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఎప్పటిలాగే బాలికలు సత్తా చాటారు. బాలుర కంటే 2.94 శాతం ఎక్కువ ఉత్తీర్ణత నమోద చేశారు. బుధవారం మధ్యాహ్నం రవీంద్ర భారతిలో ఫలితాలను రాష్ట్ర విద్యామంత్రి, సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. బాలురు 91.32 శాతం ఉత్తీర్ణత సాధించగా బాలికలు 94.26 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. మొత్తం ఫలితాల్లో గతేడాది కంటే 1.47 శాతం ఎక్కువ ఉత్తీర్ణత నమోదు అయింది. ఈ ఏడాది 4,629 స్కూల్స్ 100 శాంత ఉత్తీర్ణత సాధించగా ఒక్క విద్యార్థి కూడా పాస్ కాని పాఠశాలలు రెండు ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా 99.29 శాతంతో అగ్ర స్థానంలో నిలవగా, వికారాబాద్ జిల్లా 73.97 శాతం ఉత్తీర్ణతతో చివరి స్థానానికి పరిమితమైంది. ఈ సారి జీపీఏ విధానం తొలగించి సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్ల విధానం తీసుకువచ్చారు. కనీస మార్కులు వస్తే పాస్ లేదంటే ఫెయిల్ అని మార్కుల మెమోపై నమోదు చేశారు.

**ఫలితాలు ప్రభుత్వ తీరుకు గీటురాయి : సీఎం రేవంత్ రెడ్డి**

పదో తరగతి లో ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధించడం ప్రజా ప్రభుత్వం పనితీరుకు గీటురాయి అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని బలంగా విశ్వసిస్తున్నామన్నారు. దేశంలో



సమూలమైన మార్పు రావాలంటే ప్రతి వారికీ నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. బుధవారం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో కలిసి సీఎం పదో తరగతి పరీక్షా ఫలితాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు ముఖ్యంగా రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రైవేటు సంస్థలకన్నా మెరుగైన ఫలితాలు సాధించడం పట్ల సిబ్బందిని, అధ్యాపకులను, విద్యార్థులను ముఖ్యమంత్రి గారు మనస్ఫూర్తిగా అభినందించారు. 2025 మార్చి 21 వ తేదీ నుంచి ఏప్రిల్ 4 వ తేదీ వరకు జరిగిన ఎస్సెస్సీ పరీక్షలకు ప్రభుత్వ, ప్రైవేటు కలిపి మొత్తంగా 5,07,107 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెగ్యులర్ గా 4,96,374 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 92.78 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటుగా 10,733 మంది హాజరు కాగా, వారిలో 57.22 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలోని 4,629 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈ ఫలితాల విడుదల కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి , షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్ రావు, విద్యా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు**

జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్ఎస్సీ బోర్డు ప్రకటించింది. సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపునకు మే 16 వరకు గడువు ఇచ్చింది. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కు మే 15 వరకు అవకాశం కల్పించారు. సబ్జెక్టుకు రూ. 500 చెల్లించి రీ కౌంటింగ్, సబ్జెక్టుకు రూ. వెయ్యి చెల్లించి రీ వెరిఫికేషన్ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది.

# అంగన్వాడీలకు మే నెల సెలవులు

- ప్రకటించిన మహిళా శిశు అభివృద్ధి శాఖ కమిషనర్ కాంతివెస్లీ
- కృతజ్ఞతలు తెలిపిన తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (బీఆర్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి



**కలంజ్యోతి, హైదరాబాద్ :** అంగన్వాడీ కేంద్రాలకు మే నెల సెలవులు ప్రకటించి టీహెచ్ ఆర్ ఇవ్వ డానికి అనుమతినిచ్చిన మహిళాభివృద్ధి స్త్రీ,శిశు,సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియ న్ (బీఆర్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి కృతజ్ఞతలు తెలిపారు. మహిళా శిశు అభివృద్ధి శాఖ కార్యాలయంలో మంత్రి ఆదేశాల మేరకు కమిషనర్ కాంతివెస్లీ ఆధ్వర్యంలో బుధవారం అంగన్వాడీ యూనియన్ నాయకులతో సమావే శం ఏర్పాటు చేశారు. యూనియన్ల అభ్యర్థన మేరకు వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అంగన్వాడీ కేంద్రాలకు మే నెల మొత్తం సెలవులు ప్రకటించారు. అంగన్వాడీ కేంద్రాలకు గర్భిణులు, బాలింతలు, భోజనానికి రావడం ఇబ్బంది పడుతుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నం దున పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలకు కూడా పిల్లలు రాలేకపోతున్నారని యూనియన్ల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకుని సెలవులు ప్రకటించడంపై అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్ప ర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి, రాష్ట్ర, జిల్లా, ప్రాజెక్ట్ కమిటీ సభ్యులు అంగన్వాడీ టీచర్స్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సమావేశానికి అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (బీఆర్‌టీయూ) వి.రమాతార, కోశాధికారి ఎం.వేదవతి హాజరయ్యారు.



# యువతి వివాహానికి చేయూత

**రూ.10వేలు, టేక్ మంచాలు అందజేసిన బెంద్రం ఫౌండేషన్**

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండలంలోని సోమారంపేట గ్రామానికి చెందిన సంకిటి భక్కయ్యమంగ కుమార్తే అశ్వినికనకరాజ్ యాదవ్ వివాహానికి బెంద్రం ఫౌండేషన్ చేయూతనిచ్చింది. రూ.10వేలు, టేక్ మంచాలు అందజేసి తన దాతృత్వానికి చాటుకుంది. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ బెంద్రం స్వర్ణంజలి మాట్లాడుతూ ఇల్లంతకుంట మండలంలోని పేద కుటుంబలకు చెందిన యువతుల వివాహలకి ఎల్లపుడు సహాయాలు అందిస్తూనే ఉంటామన్నారు. గ్రామాల్లో యువకులు, సేవా ప్రతినిధులు సమాచారమాందించలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సేవా ప్రతినిధులు బొల్లారం ప్రసన్న కుమార్, మేఖ శ్రీనివాసు, అంతగిరి అనిల్, కేశవేణి భూమేశ్, మూడపెల్లి మధు, పోరెడ్డి మహేందర్ రెడ్డి, బొంగోని శ్రీనివాస్, సంకిటి రాజు, తదురి మిన్ను, శేఖర్ పాల్గొని వధువువరులను ఆశీర్వదించారు.

# కులగణనకు ఓకే

**కలంజ్యోతి, న్యూ ఢిల్లీ:** కుల గణన సర్వే చేపట్టాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. జనాభా గణనతోపాటు కులగణనను కూడా ఒకే సారి రెండు లెక్కలను తేల్చాలని నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ మంత్రివర్గం బుధవారం మధ్యాహ్నం భేటీ అయ్యింది. మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వివరించారు. కులగణనను ప్రాథమిక జనాభా లెక్కల్లో చేర్చనున్నట్లు వివరించారు. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి జనాభా గణనతోపాటే కులగణనను ప్రారంభించే అవకాశం ఉందని వెల్లడించారు. గణన పూర్తయ్యేందుకు రెండు సంవత్సరాలు పడుతుందని చెప్పారు. తుది గణాంకాలు 2026 చివరిలో లేదా 2027 ప్రారంభంలో అందుబాటులోకి వస్తాయన్నారు. కోవిడ్ 19 మహమ్మారి కారణంగా 2021లో జనాభా లెక్కలు వాయిదా పడ్డాయని చెప్పారు. సాధారణంగా జనాభా గణన ప్రతీ 10ఏళ్లకు ఒకసారి నిర్వహిస్తారు. ఈ సారి మాత్రం ఆలస్యం జరిగిందన్నారు. కేంద్రమంత్రి వివరణ ప్రకారం తదుపరి జనగణన 2035లో జరనుంది.



**రూ. 22,684 కోట్లతో స్పీడ్ కారిడార్**


షిల్లాంగ్ నుంచి సిల్చార్ (మేఘాలయ-అసోం) హైవే స్పీడ్ కారిడార్ ను నిర్మించాలని నిర్ణయించినట్లు మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. 166.8కి.మీ. ఆరు లేన్లుగా నిర్మించాలని నిర్ణయించామన్నారు. దాంతో నార్త్ ఈస్ట్ ప్రయాణంలో వేగం పెరుగుతుందన్నారు. ఇందు కోసం రూ. 22,864 కోట్లు ఖర్చు అవుతుందని వెల్లడించారు. 2025-26కు గాను చెఱకుకు కనీస మద్దతు ధర పెంచుతూ నిర్ణయం తీసుకున్నామన్నారు. క్వింటాకు రూ. 355 ఎఫ్ ఆర్ పీ పెంచామన్నారు. కాగా దేశంలో తొలిసారిగా బిహార్ 2023లో కులగణన లెక్కల డేటాను విడుదల చేసింది. 1947 నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ వ్యతిరేకించేదే అని మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. 1947 నుంచి కులగణన జరగలేదన్నారు. కాంగ్రెస్, కూటమి పార్టీలు కులగణను కేవలం రాజకీయ ఆయుధంగా మలచుకోవాలని మాత్రమే చూశాయని చెప్పారు. వీరి దుష్ట పన్నాగాలు దేశ ప్రజలు అర్థం చేసుకున్నారని వివరించారు. వీరి చర్యలు సమాజంలో అసమానతలు, సందేహాలను సృష్టించాయని చెప్పారు. వీటన్నింటినీ తొలగించాలని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు.

**జనగణన..**

ఆంగ్లేయుల కాలంలో జనగణనతోపాటు, కులగణన చేయించేవారు. 1947 స్వాతంత్ర్యం వచ్చాక ఈ విధానం పూర్తిగా రద్దయింది. 1881లో భారత్ లో తొలిసారిగా జనాభా, కులగణన లెక్కింపు చేపట్టారు. 1931 వరకు ఇదే విధానాన్ని కొనసాగించారు. 1941లో జన, కుల గణన జరిగింది కానీ వాటికి సంబంధించిన గణాంకాలను వెల్లడించలేదు.

భారత రాజ్యాంగ నిర్మాతలు, స్వాతంత్ర్యం అనంతరం తొలి కేబినెట్ భేటీలో నెహ్రూ, పటేల్, అంబేద్కర్, మౌలానా ఆజాద్ లు కుల గణను చేపట్టొద్దని మంత్రివర్గంలో నిర్ణయించారు. ఇది దేశ విచ్ఛిన్నానికి కారణం కాగలదని భావించారు.

స్వాతంత్ర్యం అనంతరం 1951లో తొలిసారిగా జనాభా గణన జరిగింది. ఈ గణనలో కేవలం ఎస్సీ, ఎస్టీల గణాంకాలను మాత్రమే లెక్కించారు. ఈ రెండు కులాల వారు అత్యంత వెనుకబడి ఉన్నందున వీరి కులగణన అనివార్యమైనట్లు ప్రకటించారు.




# పేద ముస్లింల సంక్షేమానికే వక్ఫ్ చట్ట సవరణ

**బీజేపీ మండల అధ్యక్షుడు అనిల్ కుమార్**

**కలంజ్యోతి ఇల్లంతకుంట :** పేద ముస్లింల సంక్షేమానికే వక్ఫ్ చట్ట సవరణ -2025 బిల్లును సవరించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు భూమల్ల అనిల్ కుమార్ వివరించారు. మండల కేంద్రంలో వక్ఫ్ చట్ట సవరణ2025కి సంబంధించిన కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఇప్పటివరకు ముస్లిం పెత్తందారుల చేతుల్లో ఉన్నదన్నారు. లక్షల ఆస్తుల నుండి రూ.వేల కోట్ల ఆదాయాన్ని కొన్ని ముస్లిం కుటుంబాలు మాత్రమే అనుభవిస్తున్నాయని వివరించారు. దేశంలో లక్షల కొద్ది పేద ముస్లింలకు వక్ఫ్ ఆస్తుల ఆదాయం దక్కకుండా కొంతమంది పెత్తందారులు స్వాహా చేశారని విమర్శించారు. వక్ఫ్ బోర్డు రాజ్యాంగబద్ధం చేయడం ద్వారా వక్ఫ్ ఆస్తులు, వక్ఫ్ ఆదాయం సంబంధించిన పారదర్శకత వస్తుందని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ బత్తిని సాయిగౌడ్, మండల మాజీ అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్, జిల్లా నాయకులు కొలనూరు ముత్తక్క, మామిడి హరీష్, మాజీ అసెంబ్లీ కో కన్వీనర్ బత్తిని స్వామి, మండల నాయకులు పొన్నం కృష్ణ పాల్గొన్నారు.

# నేటి తరానికి ఓంకార్ ఆదర్శం

**జస్టిస్ చంద్రకుమార్**

**కలంజ్యోతి, శేరిలింగంపల్లి :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో, చట్టసభ శాసనసభ లో ఓంకార్ పాత్ర నేటి రాజకీయాల్లో అందరికీ ఆదర్శం అని రిటైర్డ్ హైకోర్టు జడ్జి చంద్రకుమార్ అన్నారు. బుధవారం ఓంకార్ భవన్ బాగ్ లింగం పల్లి లో ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ లోగో ను జస్టిస్ చంద్ర కుమార్ యంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, కుంభం సుకన్య, రాష్ట్ర కమిటీ సభ్యులు గాదె మల్లేష్, తుడుం అనిల్ కుమార్, పల్లె మురళి, ఎ.కిష్టయ్య, కర్ర దానయ్యతో కలిసి ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఓంకార్ రాజకీయాలను సేవ గా భావించి ప్రజల కోసం అహోరాత్రులు పోరాడిన నేత అని, శాసనసభ లో ఓంకార్ అనేక ప్రజా సమస్యలపై ముందు తాను అధ్యయనం చేసి ఆ సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడె వారిని, అవసరం అయితే వాయిదా తీర్మానాలు పెట్టే వారు అని ఓంకార్ అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానం చెప్పే పరిస్థితి ఉండేది కాదు అని, ఓంకార్ అసెంబ్లీ లో సకల వర్గాల సంక్షేమం కోసం యావత్ రాష్ట్ర ప్రజలందరి సమస్యలపై పోరాడిన నాయకులు అని అలాంటి నాయకుని శతజయంతి వార్షికోత్సవాలు నిర్వహణ నేటి తరానికి స్ఫూర్తి ఇస్తుంది అని, ఓంకార్ నిర్మాణం చేసిన ప్రజా పోరాటాల మార్గం లో వేగవంతమైన మరిన్ని ప్రజా పోరాటాల నిర్మాణం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా యంసిపిఐ ( యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ..అసెంబ్లీలోనే కాకుండా కామ్రేడ్ ఓంకార్ భూమి,భుక్తి, విద్య, వైద్యం, సామాజిక న్యాయం కోసం చట్ట సభల వెలుపల కూడా



అనేక సమరశీల ప్రజా పోరాటాలు నిర్మాణం చేశారు అని పార్లమెంటు పార్లమెంటేతర ఉద్యమాలు ఎలా నిర్మాణం చేయవచ్చో ఆచరించి నిర్మాణం చేసి చూపిన పీడిత జన నేత కామ్రేడ్ ఓంకార్ అని ఆ మహోన్నత నేత శతజయంతి వార్షికోత్సవ ప్రారంభ సభ మే 12 న వరంగల్ జిల్లా మచ్చాపూర్ వద్ద నిర్మాణం అయిన వారి సంస్మరణ కోసం ఆసియా ఖండంలో లోనె అతి పెద్ద స్తూపం వద్ద ప్రారంభ సభ ఉంటుంది అని ఈ సభకు కవులు, కళాకారులు, వామపక్ష కమ్యూనిస్టు పార్టీ ల రాష్ట్ర నేతలు హాజరవుతున్నారు అని దీన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# పది పరీక్షల్లో 96.2 శాతం ఉత్తీర్ణత

**కలంజ్యోతి, నిర్మల్:** బుధవారం విడుదల చేసిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాలో 96.2 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. 4441 మంది బాలురు పరీక్షలు వ్రాయగా 4261 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కాగా 4682 మంది బాలికల్లో 4561 మంది పాసయ్యారు. మొత్తం 9123 మందికి గాను 8822 మంది పాసయ్యారు. బాలికల ఉత్తీర్ణత శాతం 95.95 కాగా బాలుర శాతం 97.42 ఉంది. కాగా వాసవి పాఠశాలకు చెందిన నల్ల నయన 589 మార్కులు సాధించి జిల్లా టాపర్ గా నిలిచారు.



## కేరళ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండల కేంద్రంలోని కేరళ మోడల్ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమార్ తెలిపారు. ఎర్రం సాత్విక్ 577 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం, వేములవాడ జ్యోతి 575 మార్కులు సాధించి మండల ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. పది పరీక్షలకు 25 విద్యార్థులు రాయగా వారిలో 21 మందికి 500పైగా మార్కులు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. కాగా.. ప్రతిభ చాటిన విద్యార్థులందరిని, బోధన సిబ్బందిని పాఠ శాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్ రెడ్డి, బాలకృష్ణ, ఘని, బిజూ, రేణుక, మహేందర్, నయనా లతో ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





## 99.29శాతం ఉత్తీర్ణత

**కలంజ్యోతి, మల్యాల :** పదో తరగతి ఫలితాల్లో మండలంలోని 11 ప్రభుత్వ, 5 ప్రైవేట్ పాఠశాలలు, తాటిపల్లి బాలికల గురుకుల, కస్తూర్బాగాంధీ, నూకపల్లి మోడల్ స్కూల్ కలిపి 99.29శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి జయసింహారావు తెలిపారు. ఇందులో కస్తూర్బా, మోడల్ స్కూల్, పోతారం, రామన్నపేట హైస్కూల్స్ మినహా మిగతా వాటిలో 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మోడల్ స్కూల్ కి చెందిన యల్ల శివ ప్రియ 579/600 , కేజీబీవీకి చెందిన పాదం అలేఖ్య 573/600, తాటిపల్లి బాలికల గురుకులకు చెందిన ఆరాధన, మేఘనలు 572 మార్కులు సాధించినట్లు ఎంఈఓ జయసింహారావు వివరించారు. జిల్లాలో మండలం 7వ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు.

## ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ విద్యార్థులు



**కలంజ్యోతి, నాగారం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లోనాగారం మండలంలోని ఫణిగిరి ఈటూరు గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పి పూజ 545/600 మండలం ఫస్ట్ ర్యాంక్ సాధించగా మేడబోయిన ప్రశాంత్ 541/600 మార్కులతో సెకండ్ ర్యాంక్ సాధించారు అలాగే మోడల్ స్కూల్ నుండి జై శివ గణేష్ 545/600 ఫస్ట్ ర్యాంక్ సాధించాడు మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ పాఠశాల నుండి బి నందకుమార్ 568/600 ఫస్ట్ ర్యాంకు సాధించగా 551/600 గాను ఎస్ హర్షవర్ధన్ రెండవ ర్యాంక్ ప్రవేట్ పాఠశాల మేరీ మదర్ నుండి559/600 సాయి శ్రీ మొదటి ర్యాంక్ సాధించి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని మండల విద్యాధికారి వాసం ప్రభాకర్ అలాగే ఎంతో సంతోషం వ్యక్తపరిచారు అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు మంచి మార్కులు వచ్చాయని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# ప్రతిపక్ష హోదా ఎందుకు?




మొదటిపేజీ తరువాయి

ఫలితాలను విడుదల చేసిన అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన మహాత్మ బసవేశ్వర జయంతి ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీకి రాని కేసీఆర్ తన పిల్లల్ని పంపిస్తా అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంత దానికి కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడిగా ఉండడం ఎందుకని ప్రశ్నించారు. అదే సమయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే, విమర్శించే హక్కు కూడా ఆయనకు లేదని స్పష్టం చేశారు. అధికారంలో ఉంటే చెలాయిస్తాం.. లేదంటే అసెంబ్లీకే రాను అంటే ఎలా అని చురకలంటించారు. వచ్చే పదేళ్లు తామే రాష్ట్రంలో అధికారంలో ఉంటామని సీఎం ధీమా వ్యక్తం చేశారు. అదే పదేళ్లు కేసీఆర్ ఫార్మ్ హౌస్ లోనే ఉంటారని సెటైర్లు వేశారు. కేసీఆర్ చరిత్ర అక్కడే ముగిస్తుందన్నారు. పదేండ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని అన్ని విధాలుగా దోచుకుందని సీఎం ఆరోపించారు. ఏ రంగంపై చర్చిద్దామో చెప్పాలని సవాల్ విసిరారు. నిండు సభలో తాను చర్చకు సిద్ధమన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా తమ నిర్ణయాల్లో ఉన్న తప్పులు చెబితే వాటిని సరిదిద్దుకుంటామని సీఎం చెప్పారు. అదే సమయంలో వరంగల్ సభలో కేసీఆర్.. కాంగ్రెస్ ను విలన్ గా అభివర్ణించడాన్ని రేవంత్ రెడ్డి తప్పు పట్టారు. ఏడు దశాబ్దాల కలను నెరవేరుస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయిందా? మరెందుకు విలన్ అయిందో చెప్పాలని నిలదీశారు. రైతుబంధు, రుణమాఫీ, ప్రజాపాలన ఆగిందా అని ప్రశ్నించారు. తాము సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టామని అవి కేసీఆర్ కు కనబడటం లేదా అని నిలదీశారు. వరంగల్ సభతో కేసీఆర్ తన పాపాలు కడుక్కోవాలని చేశారని సెటైర్లు వేశారు. కానీ, చేసిన పాపాలు ఊరికే పోవన్న సీఎం.. ఇంకా అనుభవించాల్సింది ఉందన్నారు. వరంగల్ సభ మొత్తంలో కేసీఆర్ కు తన పేరు ఎత్తడానికి కూడా ధైర్యం రాలేదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ పై బసవేశ్వరుడు ప్రభావం ఎక్కువని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ తప్పిదాలు సరిదిద్దేలా ప్రతిపక్ష వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. అలాగే ప్రజల అభివృద్ధి జీవన ప్రమాణాలు పెంచేలా రాజ్యాంగం ఏర్పాటు చేసుకున్నామన్నారు.

# పది ఫలితాల్లో కస్తూర్బా ప్రభంజనం!

- కస్తూర్బా బాలికల పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత..
- 561 మార్కులతో మండల టాపర్ గా నిలిచిన జాహ్నవి
- అభినందనలు తెలిపిన ఎంఈవో రామకృష్ణ



**కలంజ్యోతి, రుద్రంగి :** రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో రుద్రంగి మండల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రభజనం సృష్టించారు. ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా మార్కులు సాధించి ఔరా అనిపించారు. కేజీవీబీ పాఠశాలకు చెందిన పి. జాహ్నవి 561మార్కులు సాధించగా, శ్రావణ్య 559 మార్కులతో మండల టాపర్ గా నిలవగా 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ వనిత తెలిపారు. మండలంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని హాసిని 559 మార్కులతో రెండవ టాపర్ గా నిలవడంతో పాటు పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. కేరళ హై స్కూల్ విద్యార్థిని రిశ్వంత్ 532 మార్కులు సాధించాడు.









రుద్రంగి ప్రభుత్వ పాఠశాల కు చెందిన జీ. శశివర్ధన్ 521, హర్షవర్ధన్ 519 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ సమ్మిరెడ్డి తెలిపారు. రుద్రంగి మండలం మానాల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన జె. నీలిమా 430 మార్కులతో పాఠశాల టాపర్ గా నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

రుద్రంగి మండలంలో మొత్తం 179 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 174 మంది విద్యార్థులు ఉత్తీర్ణత (97.20శాతం) సాధించినట్టు సాధించినట్లు ఎంఈఓ యన్ . రామకృష్ణ తెలిపారు.



# కథ కంటే.. పాటకే హోరు!

కొన్నిసార్లు ఒక పాట సినిమా కథను కూడా డామినేట్ చేస్తుంది. దాని శబ్దంతో, దాని దృశ్యాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుంది. సరిగ్గా అలాంటి మాయే చేసింది 'రైడ్ 2'లోని తమన్నా భాటియా తనదైన శైలిలో కుమ్మేసిన 'నషా' పాట. విడుదలైన క్షణం నుంచి ఈ పాట ఒక సునామీలా దూసుకుపోయింది. రికార్డుల మీద రికార్డులు కొల్లగొడుతూ అతి తక్కువ సమయంలోనే 44 మిలియన్ల వీక్షణలను సొంతం చేసుకుంది. ఇటీవల తమన్నా నటించిన 'ఒదెల 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపలేకపోయినా, 'నషా' మాత్రం ఆమె కెరీర్‌కు ఒక ఊపిరినిచ్చింది. ఆమెను మళ్లీ వెలుగులోకి తెచ్చింది. ఇప్పుడు అందరూ తమన్నా గురించే మాట్లాడుకుంటున్నారు. ఆమె అందం, ఆమె డ్యాన్స్, ఆమె గ్లామర్.. అన్నీ మళ్లీ హాట్ టాపిక్‌గా మారాయి.